క్లుప్తంగా

పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలి

అల్లవరం: రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆదివారం గ్రామ సభలు నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశిస్తూ ఎంపీడీఓ కృష్ణమోహన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సర్పంచ్‌లు, అధికారులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడకూడదన్నారు. గ్రామసభలో కొత్త తీర్మానాలు, కొత్త పథకాలు, పార్టీలకు సంబంధించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదన్నారు. కేవలం రోజువారీ పాలనపై మాత్రమే గ్రామ సభ నిర్వహించాలని సూచించారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



ఎన్నికల శిక్షణా కార్యక్రమానికి హాజరైన అధికారులు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ హాలులో మూడో ఫేజ్ ప్రెసైడింగ్ ఆఫీసర్, పోలింగ్ ఆఫీసర్లకు, పీఓ, పీఓ-1, పీఓ-2, పీఓ-3లకు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో డీటీ దండయుతపాణి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలకు ఎలాంటి అనుమతులూ లేవు

అల్లవరం: ఎన్నికల కోడ్, పోలీస్ యాక్ట్ సెక్షన్లు 30, 144 అమల్లో ఉన్నందున అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో ర్యాలీలు, డీజే సౌండ్ సిస్టమ్‌లకు ఎలాంటి అనుమతులూ లేవని అల్లవరం ఎస్ఐ హరీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలన్నారు. అంబేడ్కర్ విగ్రహాల వద్దనే జయంతి ఉత్సవాలు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడు నవీన్‌కుమార్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

తాళ్లరేవు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పోలేకుర్రు పంచాయతీ చినబాపన్నపల్లె గ్రామానికి చెందిన కొంకె నవీన్‌కుమార్‌కు ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆరు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీన్‌కుమార్ తల, మెడకు తీవ్రగాయాలవ్వడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు.

నేడు వైఎస్సార్ సీపీ నియోజకర్గ కాపు సమ్మేళనం

అమలాపురం టౌన్: స్థానిక హైస్కూలు సెంటరు సమీపంలోని యెండూరి కన్వెన్షన్ హాలులో ఆదివారం సాయంత్రం 4 గంటలకు అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కాపుల సమ్మేళన సభ జరుగుతుందని పార్టీ నియోజకవర్గ కాపు ఆహ్వాన కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పినిపే విశ్వరూప్ విజయానికి అనుచరించాల్సిన వ్యూహంపై సభలో చర్చిస్తామని పార్టీకి చెందిన కాపు నాయకులు, కార్యకర్తలు ఈ సమ్మేళనానికి విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వాన కమిటీ ప్రతినిధుల బృందం మంత్రి విశ్వరూప్‌ను కలిసి సమ్మేళనంపై శనివారం చర్చించారు. ఆహ్వాన కమిటీ ప్రతినిధులు వంటిద్దు వెంకన్నాయుడు, తిక్కిరెడ్డి వెంకటేష్, జిన్నూరి వెంకటేశ్వరరావు తదితరులు శనివారం నియోజకవర్గంలోని కాపు నేతల ఇంటికి వెళ్లి సమ్మేళనానికి తరలిరావాలని ఆహ్వానించారు.

మంత్రి విశ్వరూప్ సవాల్‌ని స్వీకరిస్తున్నా

అల్లవరం: తన రాజకీయ చరిత్రలో ఒక్క రూపాయి కూడా అవినీతికి పాల్పడలేదని, అవినీతి చేసినట్లుగా నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని మంత్రి పినిపే విశ్వరూప్ విసిరిన సవాల్‌ని స్వీకరిస్తున్నట్లుగా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. మండలంలోని కోడూరుపాడులోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మంత్రి విశ్వరూప్‌పై తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి విశ్వరూప్‌పై ఎంక్వైరీ కమిటీ వేసి అవినీతిని రుజువు చేస్తామన్నారు. రాజకీయాల్లో ఎవరి స్థాయి ఏమిటో నిర్ణయించవలసింది ప్రజలేనని, మే 13న ఇద్దరిలో ఎవరు వైపు ఉంటారో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, ఆకుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న తాగునీటి చెరువులు



నీటి నిల్వలు తగ్గిన సుంకరపాలెం చెరువు



పరంపేటలో ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న నీటి సరఫరా

- వేసవి ప్రారంభంలోనే శివారు గ్రామాలకు కటకట
- ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్న యానాం ప్రజలు

యానాం: నియోజకవర్గ పరిధిలో వేసవి ప్రారంభంలోనే పలు రక్షిత మంచినీటి చెరువులు అడుగంటడంతో శివారు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు నెలకొన్నాయి. ఇప్పటికే సావిత్రినగర్, గిరియాంపేట, పరంపేట, అయ్యన్ననగర్, కురసాంపేట తదితర తీర ప్రాంత గ్రామాల్లో గత కొద్దిరోజులుగా తాగునీటి సరఫరా జరగడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు యానాం పట్టణంలో సైతం నీటి ఎద్దడి ఏర్పడడంతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే అదీ పూర్తిస్థాయిలో అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దరియాలతిప్ప చెరువులో సైతం నీటినిల్వలు తగ్గుతుండడం స్థానికులను కలవరపరుస్తోంది. అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని వేసవిలో తాగునీటి ఎద్దడి నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు.

ఏడాదికి 30 క్యూసెక్కులు అవసరం

యానాం నియోజకవర్గంలో సాగు, తాగునీటి అవసరాలకు ఏడాదికి 30 క్యూసెక్కుల నీరు అవసరమని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గతంలో ధవళేశ్వరం నుంచి యానాంకు ఏడాదికి 19 క్యూసెక్కుల నీటిని మాత్రమే సరఫరా చేసేవారు. అది సరిపోవడం లేదని యానాంకు నీటి సరఫరాను పెంచాలని దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని అప్పటి మంత్రి మల్లాడి కృష్ణారావు కోరడంతో అప్పటి వరకూ పంపిణీ చేసే 19 క్యూసెక్కుల జలాలను 30 క్యూసెక్కులకు పెంచారు. అంతేకాకుండా యానాంలో తాగునీటి కోసం ప్రత్యేకంగా రిజర్వాయర్‌లు ఏర్పాటుచేసేందుకు భూమి లేకపోవడంతో యానాం సరిహద్దులోని సుంకరపాలేనికి చేర్చి ఉన్న 55 ఎకరాల పంట భూములను ఆయన కేటాయించారు. దీంతో సదరు భూముల్లో 144.50 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఒక చెరువు, 170 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల మరో చెరువు తవ్వారు. సుమారు 80 శాతం మేర యానాం నియోజకవర్గ తాగునీటి అవసరాలు ఈ రెండు చెరువులే తీరుస్తున్నాయి. అయితే ప్రస్తుతం గోదావరిలో నీటి లభ్యత తగ్గడంతో ధవళేశ్వరం పంపింగ్ స్కీమ్ నుంచి సైతం నీరు సరిగా రాని పరిస్థితి నెలకొంది. దీంతో రెండు చెరువుల్లో నీటి మట్టాలు అడుగంటుతున్నాయి. మరో నాలుగు వారాల్లో పూర్తిస్థాయిలో నీరు అడుగంటిపోయే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు దరియాలతిప్ప వద్ద ఉన్న నల్లచెరువులో సైతం నీటినిల్వలు తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తుంది. దీంతో ఈ వేసవి తాగునీటి ఎద్దడి నుంచి యానాం ప్రజలను ఎలా గట్టెక్కించాలో అర్థం కాక పీడబ్ల్యూడీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ధవళేశ్వరం నుంచి మరో దఫా నీరు వదిలితే చెరువులు నింపుకునే అవకాశముందని సమాలోచనలు సాగిస్తున్నారు.

నీటి సరఫరా పెంచాలని కోరాం



నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని యానాం అధికారులను ఆదేశించాను. తాగునీటి సమస్యపై ఎప్పటికప్పుడు పీడబ్ల్యూడీ అధికారులతో సమీక్షిస్తున్నాను. యానాంలో తాగునీటి ఎద్దడి నివారణకు ధవళేశ్వరం నుంచి నీటి సరఫరాను పెంచేలా చూడాలని కాకినాడ జిల్లా కలెక్టర్ నివాస్‌ను కోరాను.

– ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

సుజాతకు ఉగాది నంది పురస్కారం



సొసైటీ సభ్యుల చేతుల మీదుగా ఉగాది నంది పురస్కారం అందుకున్న సుజాత

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన సాయి సంజీవిని మహిళా వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షురాలు, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా మహిళా కన్వీనర్ జల్లి సుజాతకు ఉగాది నంది పురస్కారం లభించింది. రాజమహేంద్రవరంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఉగాది నంది పురస్కారాల ప్రదానోత్సవ సభలో రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, సొసైటీ వ్యవస్థాక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజయోనా చేతుల మీదుగా సుజాత పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీశ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కళా వేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత తదితరులు సుజాతను అభినందించారు.

ప్రైవేటీకరణ జరిగితే వారిదే బాధ్యత

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా విద్యుత్‌ను ప్రైవేటీకరించడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, అదే జరిగితే దానికి ఆ రెండు పార్టీలు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఏఐఏడీఎంకే రాష్ట్ర కార్యదర్శి ఎ.అన్బళగన్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ లాభదాయకంగా ఉన్న విద్యుత్ శాఖను దశలవారీగా ప్రైవేటీకరించేలా ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ అంశం గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించారని అప్పట్లో ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి వైథిలింగం సీఎంగా ఉన్నారన్నారు. అదే పద్ధతిని ప్రస్తుత కాంగ్రెస్ కూటమి సైతం అనుసరిస్తుందని విమర్శించారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం



ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని సన్నవిల్లిలో ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్



నంగవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్
- నంగవరం, సన్నవిల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

ఉప్పలగుప్తం: సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని నంగవరం, సన్నవిల్లి గ్రామాల్లో శనివారం ఆయన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ పరిపాలనలో జరిగిన మంచిని వివరించారు. గ్రామంలో పర్యటిస్తున్న ఆయనకు అభిమానులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉండేలా సీఎం జగన్ ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారన్నారు. వీటికి అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటుచేసి గ్రామంలోనే అన్ని సేవలను అందిస్తున్నారన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రం చేయని విధంగా వలంటీర్లను నియమించి ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు చేరవేస్తున్నారన్నారు. రంగరాజుకోడు డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం చేపడితే సన్నవిల్లి, నంగవరం గ్రామాల రైతులకు విముక్తి కలుగుతుందని నంగవరం గ్రామస్తులు కోరారు. మళ్లీ ఎమ్మెల్యేగా మీ ముందుకు వచ్చి వంతెన నిర్మాణం చేపడతానని విశ్వరూప్ హామీ ఇచ్చారు. అందరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించి జగనన్నను సీఎం చేయాలని ఆయన కోరారు. సన్నవిల్లి గ్రామానికి చెందిన 20 మంది జనసేన కార్యకర్తలు మంత్రి విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ విశ్వరూప్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్, వైఎస్సార్ ఉద్యానవన పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు గుండుమోగుల వెంకటనారాయణ, గనిశెట్టి సద్గురరావు, పార్టీ మండల కార్యదర్శి శీలం సూరిబాబు, తొత్తరమూడి బాబులు, పరమట నాగబాబు, పోతుల దొరబాబు, చిక్కం చిరంజీవి శ్రీనివాసరావు, గనిశెట్టి వీరాస్వామినాయుడు, చిక్కం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదలకు లబ్ధి



కేశనకుర్రులో ప్రచారం చేస్తున్న పొన్నాడ సతీష్ తనయులు సత్యసుమంత్, రేవంత్

ఐ పోలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తనయులు సత్యసుమంత్, రేవంత్ పేర్కొన్నారు. శనివారం వారిద్దరూ మండలంలోని కేశనకుర్రు, రాయుడుపాలెం, నాగమల్లి చెట్టు, అశోక్‌నగర్, కుమ్మరి మెరక తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో తమ తండ్రి పొన్నాడను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తప్పుడు ప్రచారాలతో మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాల మాటలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, పిన్నమరాజు బాబ్జిరాజు, ఇందుకూరి రంగరాజు, కాశి పర్వేజ్‌కుమార్, లోవరాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ లబ్ధి చేకూర్చాం.. ఆశీర్వదించండి



ఉప్పంగల ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ



లచ్చిపాలెంలో ఎమ్మెల్యే పొన్నాడకు హారతి ఇస్తున్న మహిళ

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ
- రోడ్‌షోలో భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులు

తాళ్లరేవు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ లబ్ధి చేకూర్చామని, రాబోయే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. శనివారం ఆయన సుంకరపాలెం, ఉప్పంగల, లచ్చిపాలెం గ్రామ పంచాయతీల్లో పితాని బాలకృష్ణ, పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం ఆయా పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పొన్నాడకు మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఇటీవలే పార్టీలో చేరిన పితాని బాలకృష్ణను పలుచోట్ల సత్కరించారు. అనంతరం భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి ఓట్లు అడుగుతున్నామన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చేందుకు తాగునీటి ట్యాంకులు నిర్మించామన్నారు. అభివృద్ధి, సంక్షేమం అందించిన జగనన్నను తిరిగి సీఎంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాద గోవిందకుమార్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, కాటంశెట్టి రామ్మూర్తి, సర్పంచ్‌లు శాఖ శంకరుడు, అనిశెట్టి సీతారత్నం, ముద్దన వెంకట శివరామప్రసాద్, గుత్తుల శ్రీను, కాశి లక్ష్మణస్వామి, నరహరిశెట్టి విఘ్నేశ్వరరావు, రేవు మల్లీశ్వరి, వెంటపల్లి వాసంతి, దడాల జగదీశ్వరరావు, మోకా మధుబాబు, యర్రంనీడి అప్పారావు, బొంతు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నమశ్శివాయంను గెలిపించుకుందాం



దరియాలతిప్పలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న ఎన్ఆర్‌కాంగ్రెస్, బీజేపీ ఎన్డీయే కూటమి అభ్యర్థి నమశ్శివాయంను గెలుపించుకుందామని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నమశ్శివాయంకు మద్దతుగా దరియాలతిప్ప తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ యానాం నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందడం కోసం కేంద్ర ప్రభుత్వ నిధుల సాధనకు నమశ్శివాయంను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పార్లమెంట్ స్థానాన్ని గెలిపించుకోవడం ద్వారా యానాంకు ఒనగూరే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నమశ్శివాయంను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కనకాల రామదాసు, దంగుడు బియ్యం సత్యనారాయణ, కాకి నాగేశ్వరరావు, సబ్బతి లోకేశ్వరరావు, సబ్బతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక మూడు తూములు సెంటర్లో శనివారం కబడ్డీ పోటీలను సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు అంబేడ్కర్ యూత్ సొసైటీ సభ్యులు తెలిపారు. యూత్ సొసైటీ 42వ వార్షిక దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను వారు ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ యూత్ సొసైటీ అధ్యక్షుడు కాత్రు బోనీ, పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, కుసుమ చింటూ పాల్గొన్నారు.

యానాంలో పర్యటించిన డీజీపీ శ్రీనివాస్



మునిస్వామిని కలిసిన డీజీపీ శ్రీనివాస్

యానాం: ఈ నెల 19న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు శనివారం సాయంత్రం పుదుచ్చేరి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) బి.శ్రీనివాస్ యానాం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ చాంబర్‌లో ఆర్ఏఓ మునిస్వామితో భేటీ అయ్యారు. అనంతరం శ్రీనివాస్‌ను మునిస్వామి దుశ్శాలువాతో సత్కరించారు. తొలిసారిగా యానాం విచ్చేసిన శ్రీనివాస్ పోలీసుల గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరో స్లిప్ రాసిస్తే చదివేయడమేనా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు నాని తదితరులు

అమలాపురం రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు ఎవరో స్లిప్ రాసిస్తే చదివేయడం విడ్డూరంగా ఉందని, మంత్రి విశ్వరూప్‌పై బురద చల్లాలనుకుంటే ఆకాశం మీద ఉమ్మి వేసినట్లేనని పట్టణ, రూరల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్(నాని), జెడ్పీటీసీ సభ్యుడు పందిరి హరిరామ్‌గోపాల్ అన్నారు. భట్నవెల్లిలో మంత్రి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి పినిపే విశ్వరూప్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. ఆనందరావు తనకున్న అలవాట్లను మంత్రికి ఆపాదించాలని ప్రయత్నించడం సరికాదన్నారు. మున్సిపల్ కార్యాలయ స్థలాన్ని అనుచరులకు ఇచ్చి కట్టిస్తున్నారన్న ఆరోపణలు అవాస్తవం అన్నారు. రూ.3.5 కోట్ల పనులు టెండర్లు ద్వారా తప్ప నామినేషన్ కింద ఇవ్వడం కుదరదని గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన ఆనందరావుకు తెలియపోవడం శోచనీయమన్నారు. అలాగే చేపల చెరువులు తవ్వితే లంచాలు దండుకునే అలవాటు ఆనందరావుకే ఉందన్నారు. మంత్రి విశ్వరూప్‌పై చౌకబారు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పినిపే కృష్ణారెడ్డి, రూరల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కేతా భానుతేజ, బొంతు గోవిందశెట్టి పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయాలకు పోటెత్తిన భక్తులు



గుమ్మిలేరులో అలంకార భూషితుడైన వేంకటేశ్వరస్వామి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

బెల్లం ఊట ధ్వంసం

ఐ.పోలవరం: మండల పరిధిలో బైరవలంక గ్రామం శివారు మడ అడవుల్లో దాచి ఉంచిన 2500 లీటర్ల బెల్లం ఊటను ఎస్ఈబీ పోలీసులతో కలిసి గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎస్ఐ భానుప్రసాద్ శనివారం తెలిపారు.